# ఉరిశిక్షబడ్డ నిజం

వేళ్ళు మెటికలు విరుచుకొని, బద్ధకంగా ఆవులించి, అంత కన్నా బద్ధకంగా గడ్డిమీద పడుకొన్నాడు సదాశివం.

ఇంతకాలంగా తనకూ, తన ఉద్యోగానికీ ఏదో విలువ ఉన్న దనుకొన్నాడు. అదేపాటి ఉంటుందో, ఈ రెండు మూడు రోజుల్లోనూ తెలిసిపోయింది.

పట్టుమని పాతిక రూపాయల కోసం, తను చాలా మందిని అడిగాడు. అందరూ ఏదో ఓ రూపంలో లేదనే చెప్పు కొచ్చారు. తను మరీ పసి వెధవయితే తప్ప, ఆ మాటలన్నీ నమ్మకూడదు మరి! ఎప్పుడూ, పదులు గలగల్లాడించే సూర్య నారాయణా, నూటికి పది వడ్డీ చొప్పున, ఏ నిమిషాన్నయినా, అయిదా రొందలు సర్దగల శేషుబాబూ, ముందుగా యాభై రూపాయిలిచ్చి, నెలకు పది చొప్పున ఎనిమిది మాసాలపాటు ఓర్పుతో వసూలు చేసుకోగలిగిన రాంమూర్తీ- వీరందరూ తనకు లేవనే చెప్పారు. ఇదంతా అబద్ధమని తనకు తెలుసు. అయినా ఆ మాట అనడానికి లేదు. ఎదటివాడు మనల్ని మోసగిస్తున్నాడని తెలిసి కూడా, కిక్కురు మనకుండా భరించ వలసిరావడం కన్నా దురదృష్టం మరోటి ఉండదు.

పోనీ భార్య ద్వారానన్నా. దొరుకుతాయేమోనని తను ప్రయత్నించాడు. భాగ్యమ్మ పిన్నిగారు, ఇలా అప్పు డప్పుడు, వారికీ వీరికీ ఆదుకొంటూ, రూపాయికి బేడలుకన్నా ఎక్కువ పుచ్చుకోదని, వసంతే అప్పుడెప్పుడో అన్నది. ఆ లెక్క ప్రకారమే మనకూ ఓ పాతిక పుచ్చుకోమన్నాడు. జీతా లందగానే 'ముద్దర సుద్దిగా' తిరిగి ఇచ్చివేదామన్నాడు. ముందుగా పిన్నిగారు 'సరే' నన్నదిట. రెండో రోజున 'చూస్తా' నన్నదట. మూడోనాడు, తన దగ్గర దొరకవనీ, అంతగా అవసరమయితే, మరెక్కడన్నా అడుగుతాననీ, కానీ- అవతలివారు ఏదన్నా వస్తువు ఉంచందే ఇవ్వరనీ అన్నదిట.

తనూ అందుకూ సిద్ధపడేవాడే గానీ, మరొకరి దగ్గర ఉంచదగిన వస్తువేదీ తన ఇంట్లో లేదు. క్రిందటి నెల వెండి గ్లాసు అమ్మేశాడు. అంతకు ముందు మాసంలో గావును- పద్దు జడకుప్పెలు, చంటివాడి వెండిగిన్నె అమ్మేశాడు. అప్పు డెప్పుడో అమీన్‌చంద్ దగ్గరుంచిన గడియారం ఇంకా తెచ్చు కోనేలేదు. దానిమీది ఆశ తాను వొదులుకొని కూడా చాలా రోజు లయింది!

కంచాలూ గిన్నెలూ ఉంచుకొని, పాతికలూ, యాభైలూ ఇస్తారన్న నమ్మకం తనకు లేదు.

తనకైనా ఇప్పుడంత గండకత్తెర రాకపోను. అమ్మకు జబ్బుగా ఉన్నదనీ, మందులకూ, మాకులకూ, చాలా అవస్థగా

ఉన్నదనీ నాన్న రాశాడు. నాన్న సాధారణంగా తనను ఎప్పుడూ ఏదీ అడగడు. ఎంత కటకట పడుతున్నా, తనకు తెలియనివ్వడు. ఏదో విధంగా ఆయనే సర్దుకుపోతుంటాడు.

"ఆఁ ఉద్యోగమన్న మాటేగానీ ఏం మిగుల్తొందండీ! పత్రితో సహా అన్నీ కొనుక్కోవలసిందే నాయె! పైగా పిల్లా జల్లాతో ఉన్నవాడా- వాడి బతుకు వాడు బతికితే అదే పదివేలు" అనేవాడు నాన్న చాలాసార్లు.

ఓ సారి తను వెళ్ళినప్పుడు, నాన్న వేలినున్న ఉంగరం కనిపించలేదు. మరోసారి, పెద్ద గంగాళమూ, రెండు గుండిగలూ కనిపించ లేదు. కిందటిసారి వెళ్ళినప్పుడు అమ్మ కడియాలు కూడా తీసేసింది.

ఏమయిందని తను అడగకుండానే అమ్మ చెప్పుకొచ్చింది-

"మరీ బరువుగా ఉన్నాయిరా! పైగా నరాలను కూడా పట్టేస్తున్నాయి. అందుకని తీసి పెట్టెలో పడేశాను".

తను నిద్రపోయాడనుకొన్నాడు గావును—నాన్న అన్నాడు—

"ఆ గంగాళమూ, గుండిగలూ, మన శివుడి పుటకలకు, కొన్నాంగదుటే! వాడు బస్తీ కెళ్ళినప్పుడు పంపేసినా తీరిపోను...అన్నీ కరిగించుకు మింగేశాం....ఈ మాయ పొట్టల్ని దేవు డెందుకు పెట్టాడో గానీ-ఛీఛీ-వాడికేమీ మిగల్చలేక పోతున్నామే!"

తనకేమీ మిగల్చ లేకపోతున్నందుకు, తండ్రి పడు తున్న బాధ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా- తను తన పిల్లల కేమివ్వగలడన్న, ప్రశ్న మనస్సులో మెదిలి, తనను కుంగదీసి వేస్తున్నది. తండ్రి తన కీపాటి చదువు సంధ్యలైనా చెప్పించ గలిగాడు. మరి తను ? ఈ అణా కానీ ఉద్యోగంతో పొట్టలు నింపడమే గగనమయిపోతూ ఉంటే- ఇహ తను సతుకులు చెప్పించే దేమిటి ? పస్తులుంచకుండా, ఇంత ధారకం పోయ గలిగితే అదే పదివేలు !

దూరంగా గంట మోగింది.

పార్కులో లైట్లు కూడా ఒక్కొక్కటే ఆరిపోతు న్నాయి. అక్కడక్కడా చెల్లాచెదరుగా కూచున్న వారంతా లేస్తున్నారు. గూడ్సు పెట్టెల్ని షంటింగ్ చేస్తున్న రైలింజన్ 'బజ్' మంటూ ఆవిరి విడుస్తోంది.

సదాశివం కాళ్ళీడ్చుకొంటూ, రోడ్డు మీది కొచ్చాడు. తలంతా నాదుగా ఉంది. నరాలన్నీ పట్కారుతో మెలిపెట్టి నట్టు, జివ్వుమని తీసుకుపోతున్నాయి. ఎదురుగా ఉన్న హోటల్లో ఇంకా సందడిగానే ఉంది. ఎవరో బార్ లోనించి తూలుకొంటూ రోడ్డుమీది కొచ్చారు. సోడాలు కొట్టిన చప్పుడు, మత్తు వాసనతో కలిసి, వీధిలోకి పాకుతోంది. గరమ్ పల్లీవాడు తననుచూసి, మరోసారి కేక వేశాడు. ఉన్న పది పైసలూ, వేరుశనక్కాయలు కొంటే, చచ్చినట్టు మైలున్నర నడవాలి.

తనకు- కనీసం పది పైసలు పెట్టి, శనక్కాయలు కొను క్కొనే తాహతుకూడా లేదు. తను మళ్ళీ మామూలు వాడన్నా కాదు; చదువుకొన్నవాడూ, పైగా ఉద్యోగం చేస్తున్న వాడూనూ !

'ఎస్స్స్' అన్న చప్పుడూ, ఆ వెంటనే 'ఠాంగ్ ఠాంగ్' మంటూ ఓ సైకిల్ రిక్షా తనను రాసుకొంటూ పోయింది. అందులో కూచున్నవారు వెనక్కి తిరిగి తనను చూసి నవ్వుకొన్నారు. ఎందుకు నవ్వుకోరూ! తను బార్‌కు ఎదురుగా ఉన్నాడు; పైగా నడిరోడ్డుమీద. తను తాగి, ఇలా రోడ్డుకు అడ్డం పడ్డాడని వారనుకొన్నా అనుకోవచ్చు.

సదాశివం మనస్సు గిలగిల లాడిపోయింది. గబగబా కాలి బాట మీదికొచ్చాడు. సైకిళ్ళకు నూనెపోసే కుర్రాడు, తనను చూసి 'సైకిల్ నైలాయ్ సాబ్?' అని పరా మర్శించాడు.

'ఆఁ' అంటూ తను గబగబా దాటి ఇవతలికొచ్చాడు. ఇంకా అక్కడే ఉంటే, ఏమైందని వాడు అడగకా మానడు, తను ఏదో వో అబద్ధం చెప్పకా తప్పదు. తను సైకిల్‌ను మూడు వారాల కిందటే అమ్మేసినట్టు వాడికింకా తెలీదు.

కాలనీ బస్సు బయలుదేరడాని కింకా ఓ పది నిమిషాల వ్యవధి ఉంది. సదాశివం, జేబు తడివి చూసుకున్నాడు. పది పైసలు తగిలాయి. గుండె నిబ్బరంతో బస్సెక్కి కూచు న్నాడు.

బస్సు బయలుదేరే వేళకు, జనంతో నిండిపోయింది.

"ఎక్కడకూ ?" అన్నాడు కండక్టరు.

"ఖాలనీ."

వణుకుతో, అరుస్తో, కుదుపుతో, బయలుదేరింది బస్సు. ఎక్కువమంది నిద్రతో జోగుతున్నారు. తనకు ముందుగా ఉన్నవారెవరో తాగి ఉండాలి; పుల్లని వాసన ముఖాన్ని తిప్పేస్తోంది.

రెండు కణతలూ నొక్కుకొంటూ సదాశివం, తల వంచుకున్నాడు. అతనికళ్ళు మెరిశాయి. మరుక్షణమే శరీర మంతా చలి కుదుపుతో చలించిపోయింది. అతని కాళ్ళ ముందు- సరిగ్గా రెండంగుళాల దూరంలో, బూడిదరంగు పర్సు పడివుంది. దానిమీద గిల్ట్ అక్షరాలు, మసగ కాంతికి నీర సంగా మెరుస్తున్నాయి. సదాశివం, ప్రాణం జవజవ లాడి పోయింది. గుండెల్లో చెప్పరాని భయపు పొగ లేవో లేచి ఉక్కిరి బిక్కిరయ్యాడు. బితుకు బితుగ్గా అటూ ఇటూ చూశాడు. అందరూ- ఎవరి ధోరణిలో వారున్నారని అను కొన్నాడు. వొణుకుతున్న కాలు ఆ పర్స్‌మీద ఉంచాడు. ఆకు చెప్పుకింద పూర్తిగా మరుగుపడిపోయింది పర్స్.

తనిప్పుడేం చేయాలి ?

ఆ పెద్దమనిషిని తట్టి చెప్పాలి. చెబితే, ఓ నవ్వు నవ్వి, 'థాంక్స్' అంటాడు. మిగిలిన వారుకూడా తనకేసి 'ఓహో' అన్నట్టు చూస్తే చూడవచ్చు.

తనేమీ చెప్పడనుకో. దిగేలోగా అతగాడే కనుక్కుంటే, అందరితో పాటు, 'అరెరే' అని ఆశ్చర్యం ప్రకటించవచ్చు. ఏదో జేబులో ఉన్నట్టు, తనూ తడుముకోవచ్చు. అతని పర్స్ అతనికి ఇవ్వనూ వచ్చు.

ఇదేమీ జరక్కపోతే- రవంత లావుగా ఉన్న ఆ పర్స్, తన సమస్యలను తీర్చినా తీర్చవచ్చు.

ఈ పనులన్నీ జరగడానికి తను మేలుకొని ఉండటం మంచిది కాదు. నిద్రతో జోగిపోతున్నట్లు తనూ కళ్ళు మూసుకోవాలి. నిద్రమత్తున, తను పర్స్‌మీదనే కాలు పెట్టాడో, మరో దానిమీదనే కాలు పెట్టాడో ఎలా చెప్పడం? అతగాడు-ఖర్మకాలి-అలానే లేచిపోతే, మరొక డెవడూ ఆ పర్స్‌ను చూసేందుక్కూడా వీలుండదు.

సదాశివం కళ్ళు మూసుకొన్నాడు. బస్సు కుదుపులకు అటూ ఇటూ తూగుతున్నాడు. మధ్య మధ్య కళ్ళు తెరిచి చూస్తున్నాడు.

మసీదు దగ్గర చాలామంది దిగిపోయారు. తన ముందు సీటు కూడా ఖాళీ! సదాశివం గుండెదడ తగ్గడానికి బదులు హెచ్చింది. బస్సులో మరో నలుగురు ప్రయాణీకు లున్నారు. వారూ తనూ కూడా కాలనీలో దిగాలి. ఈ లోగానే తను పర్స్‌ను చే జిక్కించుకోవాలి. లేకపోతే తనుపడిన శ్రమంతా వృథా అవుతుంది!

మరోసారి ఆలోచించి, మళ్ళా కళ్ళు మూసుకున్నాడు.

కాలనీ వచ్చింది.

ఉన్న నలుగురూ దిగిపోయారు.

డ్రైవర్ కు సిగరెట్ అందిస్తూ 'సార్' అన్నాడు కండక్టరు. ఉలిక్కిపడినట్లు లేచాడు సదాశివం. కండక్టరు ఇటు తిరక్కముందే ఛటుక్కున పర్స్‌ను జేబులో వేసుకొన్నాడు. కాళ్ళు చేతులు గజగజ లాడిపోతున్నాయి. లేచి గబగబా బస్సుదిగి, ఎవరో తరుముతున్నట్లు రోడ్డుమూల కొచ్చాడు సదాశివం. చౌరస్తాలోని కొట్లు అప్పుడే మూస్తున్నారు. నాలు గైదు రిక్షాలు, రోడ్డు వారగా నిద్రపోతున్నాయి. రిక్షా వాడొకడు, సినిమా పోస్టరు కప్పుకుని, బండిలోనే ముడుచుకు పడుకొన్నాడు.

సదాశివం రోడ్డు మలుపు తిరిగాడు. బాదం చెట్టు నీడ కింద నిలుచున్నాడు. తనకోసం, ఎవరన్నా వస్తున్నా రేమో నని అటూ ఇటూ చూశాడు. ఎక్కడా ఏ చప్పుడూ వినిపించ లేదు.

ఎవరన్నా తరముకొస్తున్నట్లు, అనుమానం కలిగిన తక్షణం పర్స్‌ను విస్సిరి పారేసి, పోవడానికి అనువుగా జేబులో చేయిఉంచి పర్స్‌ను పట్టుకొన్నాడు.

రోడ్డు మలుపు దాటాడు సదాశివం. గొంది మొగదల కొచ్చాడు. ఆ చివర ఉంది అతనిల్లు. ఈ పర్స్‌తో ఇంటికెళ్ళడం భావ్యం కాదనుకొన్నాడు. దురదృష్ట వశాత్తూ - ఈ పాడు పని బైటపడితే, తను సాక్ష్యంతో సహా దొరికిపోక తప్పదు.

అయినా తనకు పర్సు కాదే కావలసింది - ఆ లోపలున్నదిగాని! దీప స్తంభం నీడ చాటున నిలబడి, పర్సు విప్పాడు. రెండు వందరూపాయల నోట్లు, మరో నాలుగు పది రూపాయల నోట్లు, ఇంత చిల్లర - కాక, మరేవో కాయితాలూ ఉన్నాయి. అవన్నీ జేబులో కుక్కుకొని, పర్సును దూరంగా విసిరేశాడు. మరోసారి అటూ ఇటూ చూసి, గొందిలోకి జొరబడ్డాడు.

* * *

సదాశివం మరోసారి ముసుగుతన్ని ముడుచుకొన్నాడు. వసంత విసుగ్గా లేపింది!

అల్లంత దూరంగా జనం గుమికూడారు. గత్తర బిత్తరగా అరవడం - ఆ గోలను చీల్చుకొంటూ, ఓ గొంతు 'అయ్యో నా బిడ్డా' అంటూ ఆర్చుకు పోవడం విన్నాడు సదాశివం.

"ఏమిటే అది?" అన్నాడతను పూర్తిగా ముసుగు తియ్యకుండానే!

"పోలీసులండీ!"

సదాశివం కొయ్యబారిపోయాడు. వసంత కేసి చావు చూపు చూశాడు; రక్తామంతా ఓడ్చుకుపోయిన వాడిలా!

వసంత కిదేమీ పట్టినట్టు లేదు. తన ధోరణిలో తాను చెప్పుకు పోతూనే ఉంది.

"మన వీధి మొగదల్న, ములగ చెట్టు ఇల్లు లేదండీ! ఆ కొంపలో ఓ వెధవ అద్దెకు చేరాళ్ళండి! ఇదివరకు వాడు

దొంగతనాలు చేసి జైలుకూ్కడా పోయాట్ట!"

సదాశివం నడి మంచం మీద కూచున్నాడు దుప్పటి కప్పుకొని.

"ముందు తలుపులు వెయ్యవే చలిగా ఉంది."

"నిన్ననట - ఓ పెద్దమనిషి జేబు కొట్టేశాట్ట. పోలీసు లొచ్చారు. డబ్బైతే దొరకలే దనుకోండి - కనీసం - ఆ వెర్రి వెధవ పర్సన్నా దూరంగా పారేశాడు కాదు" అన్నది వసంత కసువంతా కాగితంలోకి ఎత్తుతూ.

"అయినా అవేం పనులండీ! దున్నపోతులాగ ఉన్నాడు గదా! ఏ కూలో నాలో చేసుకో కూడదూ? ... వాణ్ణి మీరు చూశారో లేదో గానీ - పైకి ఎంత మెత్తగా కనిపిస్తాడనీ!"

వసంత లోపలికి పోయింది.

సదాశివం దిండు కవరులోకి చేయిపోనిచ్చి చూశాడు. వేళ్ళకేవో కాయితాలు తగిలాయి. వాటి నలానే పట్టుకొని, కన్నీళ్ళు కనిపించకుండా ఉండేందుకు మరోసారి ముసుగు కప్పుకొని, ఇంకోసారి ముడుచుకు పోయాడు.